క్లుప్తంగా

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

ఎస్ఐ నర్సింలు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నర్సింలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, వారి మాయమాటలను నమ్మి ఖాతాలో ఉన్న డబ్బులు పోగొట్టుకోకుండా జాగ్రత్త పడాలని ఎస్ఐ నర్సింలు అన్నారు. మంగళవారం చిలప్‌చెడ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. బ్యాంకు సిబ్బంది నుంచి ఎలాంటి ఫోన్ కాల్స్ రావన్నారు. మొబైల్ ఫోన్లలో వచ్చే అనవసర లింక్‌లపై క్లిక్ చేసి, ఖాతాలో డబ్బులు పోగొట్టుకుండా జాగ్రత్త పడాలన్నారు. అవసరమైతే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



నీటి సమస్య పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్‌లో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ గ్రామాన్ని సందర్శించి నీటి సమస్యపై ఆరా తీశారు. గంగిరెడ్డులవాడకు నీటిని సరఫరా చేశారు. ఎస్సీ కాలనీలో బుధవారంలోగా మంచినీటి సమస్య పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చిన్నశంకరంపేట(మెదక్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని నార్సింగి ఏఓ హరిప్రసాద్, ఎస్ఐ మోయినొద్దీన్ హెచ్చరించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు నాసిరకం విత్తనాలు అందిస్తే చర్యలు తప్పవన్నారు. విక్రయ రశీదు తప్పనిసరిగా అందించడంతో పాటు లాగ్‌బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులు కూడా పంటకాలం పూర్తయ్యే వరకు రశీదులు భద్రపరచుకోవాలని కోరారు.

ప్రతిష్ఠ మహోత్సవం



శిఖర పూజ నిర్వహిస్తున్న పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూర్‌లో నిర్మించిన శ్రీ గురుపీఠంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం కనుల పండువగా ప్రారంభమైంది. గ్రామవాసి శివకుమార్‌గౌడ్ సంకల్పించిన శ్రీ గురుపీఠంలో దత్తాత్రేయ, సాయిబాబ ఆలయాల నిర్మాణాలు చేపట్టారు. అందులో భాగంగా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మొదటి రోజు వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో రుత్విజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రమణగౌడ్, బిక్షపతియాదవ్, హన్మంతు, యాదగిరియాదవ్, తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మదేవికి ఘనంగా బోనాలు



బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని నాగ్సన్‌పల్లిలో శ్రీ రేణుక ఎల్లమ్మదేవి 16వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పెద్దెత్తున బోనాలు తీసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లం, మాజీ ఉప సర్పంచ్ నరహరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారా రామాగౌడ్, నాయకులు నవీన్‌రావు, లింగం, కిషోర్‌గౌడ్, సాయాగౌడ్, కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి సదస్సులు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సదస్సులను ఆయా ప్రాంతాల్లో మెదక్ ఆర్డీఓ రమాదేవీ, నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్లు సదస్సులను పరిశీలించారు. రైతుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దరఖాస్తులను పరిశీలించి.. తగు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

జిల్లాలో భూభారతి సదస్సులు ప్రారంభం

- భూభారతి ద్వారా సమస్యల పరిష్కారం
- మెదక్ ఆర్డీవో రమాదేవి



చిన్నశంకరంపేట: అంబాజిపేటలో భూభారతి సదస్సును పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): భూభారతి సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లిలో భూభారతి కార్యక్రమం ద్వారా స్వీకరిస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూరేణుక, గిర్దావర్ అబేద్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం అంబాజిపేటలో నిర్వహించిన భూ భారతి సదస్సును ఆర్డీఓ రమాదేవీ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఆర్ఐ రాజు తదితరులు ఉన్నారు.

నార్సింగిలో...

నార్సింగి మండలం బీమ్‌రావుపల్లిలో భూ భారతి సదస్సును తహసీల్దార్ కరీం అధ్వర్యంలో నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, సర్వేయర్ శ్రీకాం పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వెల్దుర్తి(తూప్రాన్): భూ భారతి సదస్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మారం, పెద్దాపూర్ గ్రామాల్లో మంగళవారం భూ భారతి సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి 12 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ బాలలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, హఫీజా తదితరులు పాల్గొన్నారు.

154 దరఖాస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో తహసీల్దార్ ఆంజనేయులు, రాజిపేటలో డిప్యూటీ తహసీల్దార్ జహీర్ రెవెన్యూ అధికారులు మంగళవారం భూభారతి సదస్సులు నిర్వహించగా 154 దరఖాస్తులు వచ్చాయి. వెంకటాపూర్(ఆర్)లో 80, రాజిపేటలో 74దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి: దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి



శివ్వంపేట: మగ్దుంపూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మైపాల్

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధి శభాష్‌పల్లి, మగ్దుంపూర్ గ్రామాల్లో భూ భారతి సదస్సులను పరిశీలించారు. మగ్దుంపూర్‌లో 23, శభాష్‌పల్లిలో 49 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కమలాద్రి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషన్, తదితరులు ఉన్నారు.

సాదా బైనామాలే అధికం

కొల్చారం(నర్సాపూర్): మండలంలో ప్రారంభమైన భూభారతి సదస్సుల్లో అత్యధికంగా సాదా బైనామాల దరఖాస్తులే ఎక్కువగా వచ్చాయి. ఏటిగడ్డ మాందాపూర్‌లో వివిధ పెండింగ్ భూ సమస్యల కోసం 56 మంది దరఖాస్తులు చేసుకోగా అందులో 21 సాదా బైనామాలే, తుమ్మలపల్లిలో 11 దరఖాస్తులు రాగా.. అందులో 6 సాదాబైనామాలు ఉన్నాయి. ఈ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసా చారి, ఆర్ఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

59 దరఖాస్తులు

రేగోడ్(మెదక్): మండలంలోని చౌదర్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో 59 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ దత్తరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఫెరోజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

18 దరఖాస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిధిలోని పోతారం గ్రామంలో 18 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిటీ కౌశిక, ఆర్ఐ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

116 దరఖాస్తులు

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్, కోనాయిపల్లి(పీబీ) గ్రామాల్లో భూభారతి సదస్సులు నిర్వహించారు. కోనాయిపల్లి(పీబీ)లో 20, మల్కాపూర్‌లో 96 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

ఖాన్ చెరువు శిఖం భూమి కబ్జా!

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఆర్‌ఎంపీ వైద్యుడిని నిలదీస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): ఆయకట్టుకు సాగు నీరందించే చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) గుర్తింపులో ఆయా శాఖల అధికారుల ఉదాసీనత కారణంగా శిఖం భూములు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం కొరవడంతో కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇందుకు మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులో ఈ ఘటన సోమవారం వెలుగుచూసింది. వెల్దుర్తి గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు కొన్ని నెలల క్రితం మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులో కొంత అసైన్డ్ భూమిని కొనుగోలు చేశాడు. ఈ భూమి గ్రామంలో ఖాన్ చెరువు సమీపంలో ఉంది. దీంతో ఎవరు ఏమి చేస్తారు అనే ధీమాతో ఇటీవల ఖాన్ చెరువు శిఖం నుంచి జేసీబీ సహాయంతో కొత్తగా మట్టిరోడ్డును నిర్మించారు. నిన్నటి వరకు వరి కోతలు, ధాన్యం అమ్మకాల్లో బిజీగా ఉన్న అన్నదాతలు సోమవారం అటుగా వెళ్లడంతో చెరువు శిఖం నుంచి అక్రమంగా వేసిన మట్టిరోడ్డు దర్శనమిచ్చింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు చెరువు ఆక్రమణను వెంటనే తొలగించాలని సదరు ఆర్‌ఎంపీ వైద్యుడిని పిలిచి నిలదీశారు. చెరువులోకి వర్షపు నీరు రాకుండా అక్రమంగా వేసిన మట్టి రోడ్డును 24 గంటల్లో తొలగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

మట్టి రోడ్డు తొలగింపు

ఎల్కపల్లి గ్రామ శివారులో ఖాన్ చెరువు శిఖం భూమిలో అక్రమంగా వేసిన మట్టి రోడ్డును మంగళవారం ఇరిగేషన్ డీఈ రాజేందర్ సందర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వేయడంతో హిటాచీ యంత్రం సహాయంతో మట్టి రోడ్డును తొలగించారు.

పరిహారం వెంటనే అందించాలి

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే సునీతా



బాధితుడ్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): భూమి కోల్పోయి అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితుడిని ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన ఆటో డ్రైవర్ కంచన్‌పల్లి శేఖర్ సంగారెడ్డి ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడిని పరామర్శించిన ఎమ్మెల్యే.. ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. బాధితులకు పరిహారం వెంటనే అందజేయాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు రమాకాంత్ రెడ్డి, శేఖర్‌గౌడ్, రాజేందర్‌నాయక్, పాండరీగౌడ్, రవి, తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సీఐ వెంకట్ రాజాగౌడ్

రామాయంపేట(మెదక్): ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సీఐ వెంకట్ రాజాగౌడ్ పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్, ఆయుష్మాన్ భారత్ అఈజిజర్యంలో మంగళవారం రామాయంపేటలో నిర్వహించిన అవగాహ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. యోగా విషయమై విస్తృత ప్రచారం నిర్వహించడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్యం విషయమై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. వాకర్స్ అసోసియేషన్ చైర్మన్ రాంరెడ్డి మాట్లాడుతూ యోగాతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయుష్ శిక్షకులు మద్దెల భరత్ మాట్లాడుతూ యోగా విషయమై అందరి సహకారం అవసరమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, దామోదర్ మాట్లాడారు.

సహజవనరులను పరిరక్షించుకోవాలి

నారాయణఖేడ్: సహజవనరులను పరిరక్షించుకోవడానికి ప్రతీ ఒక్కరు సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. స్టోన్ వాటర్‌డే సందర్భంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల పక్కన పెరిగిన చెట్ల పొదలను జేసీబీతో తొలగించారు. పలుకాలనీల్లో మురుగుకాల్వలు, వీధులను శుభ్రం చేశారు. పచ్చదనం, పరిశుభ్రత, సహజవనరుల పరిరక్షణ తదితర అంశాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. నిర్వహించారు.

మంత్రుల కటాక్షం కోసం..

ప్రారంభానికి నోచుకోని వైకుంఠ ధామం



నర్సాపూర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వైకుంఠధామం

నర్సాపూర్: నర్సాపూర్‌లో వైకుంఠ ధామం నిర్మాణ పనులు పూర్తయినా వినియోగంలోకి తేవడం లేదు. అదేమిటని ఆరా తీస్తే.. మంత్రులు ప్రారంభించాలని, వారి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో రూ.90లక్షలు వ్యయంతో వైకుంఠ ధామం నిర్మాణ పనులు చేపట్టారు. పట్టణానికి చెందిన శ్మశానవాటిక ఆవరణలో వైకుంఠ ధామం పేరుతో పలు పనులు చేపట్టారు. ఐదు నెలల క్రితమే పనులు పూర్తయి.. ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అయినా మున్సిపల్ అధికారులు వినియోగంలోకి తీసుకురావడం లేదు. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రస్తుతం ఒక్కటే బర్నింగ్ ప్లాట్‌ఫాం ఉన్నప్పటికి స్నానాలు చేసేందుకు బాత్‌రూంలతో పాటు ఇతర వసతులు లేవు. ఎవరైనా చనిపోతే శవాలకు అంత్యక్రియలు చేయాల్సి వచ్చినప్పుడు అక్కడికి వచ్చే ప్రజలు చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. కొత్తగా నిర్మించిన వైకుంఠధామాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు వివరణ కోరగా.. వైకుంఠ ధామం ప్రారంభించేందుకు మంత్రుల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

సీజనల్ వ్యాధులు నివారణకు చర్యలు

డాక్టర్ వికాస్

రేగోడ(మెదక్): పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ వికాస్ తెలిపారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని ఎస్సీ కాలనీలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 29 మందికి వైద్య పరీక్షలు చేయగా.. ముగ్గురికి జ్వరం వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. జూన్ నెలలో మండలంలో 12 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లోని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయించాలని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ జేసుదాసు



ఫైజాబాద్ రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పంటసాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని దీంతో అధిక దిగుబడి సాధించవచ్చని వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ జేసుదాసు అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కృషి వి/జ్ఞాన కేంద్రం తునికి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామ రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సాగు విధానాలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారాన్ని పెంచుకోవాలన్నారు. తప్పనిసరిగా పంటమార్పిడి చేయాలన్నారు. విత్తనాలు కొనేముందు జాగ్రత్తగా ఉండటంతో పాటు, విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. నేల ఆరోగ్యం, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, సమగ్ర ఎరువుల యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం, డ్రోన్ల వినియోగం, ఉత్పత్తిదారుల సంఘాల ఉపయోగాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

నర్సాపూర్: గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని బీజేపీ నాయకులు మంగళవారం సీఐ జాన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నగేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులు బాల్‌రాజ్, అరవింద్‌గౌడ్, రాంరెడ్డి, ప్రేమ్‌కుమార్, మహేందర్‌గౌడ్ తదితరులు వినతిపత్రం అందచేశారు.

◆ సమస్యలు పరిష్కరించాలని వినతి

నర్సాపూర్: మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీ సంక్షేమ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆయా శాఖల అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ కాలనీలో నీటి సమస్య, మురికి కాలువల నిర్మాణం, కరెంటు సమస్యలు ఉన్నాయని వాటిని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. వారి వెంట కమిటీ ప్రతినిధులు శంకర్‌నాయక్, అశోక్, సూరారం నర్సింలు, శ్రీనివాస్, రాజుపంత్, శ్రీనివాస్‌చారి, గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.

◆ ట్రాక్టర్ పట్టివేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని తహసీల్దార్ సహదేవ్ అన్నారు. మండల పరిధిలోని సామ్లా తండా శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం అందడంతో, పోలీసులు నిఘా పెట్టారు. మట్టిని తరలిస్తున్న వ్యక్తికి రూ. 5 వేలు, జేసీబీ యజమానికి రూ. 5 వేలు జరిమానా విధించామన్నారు.

◆ నిబంధనలు అతిక్రమిస్తే దుకాణాలు సీజ్

రేగోడ్(మెదక్): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే ఫెర్టిలైజర్ దుకాణాలను సీజ్ చేస్తామని ఏఓ జావీద్ హెచ్చరించారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని పలు దుకాణాలను మంగళవారం పోలీసులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలన్నారు. గడువు ముగిసిన ఎరువులు, పురుగు మందులు విక్రయించవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పెంటప్ప, కానిస్టేబుళ్లు సాయిలు, బల్దీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం



కొల్చారంలో రైతులకు విత్తన బస్తాలను అందజేస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు నాణ్యమైన వరి విత్తనాలను సాగు చేయాలని, విత్తనోత్పత్తి ద్వారా తోటి రైతులకు తక్కువ ధరకు అందించాలని రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ కె.శ్వేత కోరారు. మంగళవారం నార్సింగి రైతువేదికలో రైతులకు విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని ఏడు మంది రైతులకు 16 కిట్లు చొప్పున ఎంటీయూ 1010, 5 కిట్లు పెసర విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు విత్తనోత్పత్తి కోసం విత్తనాలు అందించడంతో పాటు అవసరమైన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ ప్రసన్న, ఏఓ హరిప్రసాద్, ఏఈఓ విజృంభణ పాల్గొన్నారు.

వరి, పెసర విత్తనాల పంపిణీ

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ రైతువేదికలో మంగళవారం ఏడీఏ విజయనిర్మల, రాజేంద్రనగర్ వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త జెమిమా ఆధ్వర్యంలో వరి, పెసర మూల విత్తనాలను పంపిణీ చేశారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తిలోని రైతు వేదికలో మంగళవారం 'ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, పెసర విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.లక్ష్మీ ప్రసన్న, ఏఓ యూనిస్, ఏఈఓలు మజీద్ అలీ, వందన, ఉత్తమ్ కుమార్, సాయి కిరణ్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): రైతులు మేలు రకమైన విత్తనాల ద్వారా పంట పండినప్పుడు ఆ విత్తనాలను సేకరించి, సీడ్‌గా వాడాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ నిర్మల అన్నారు. పాపన్నపేట మండలం మల్లంపేటలో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఇఓ రజిత, జనార్దన్, నాగరాజు ,ఆసిఫ్, అభిలాష్ పాల్గొన్నారు.



వెల్దుర్తిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు



పాపన్నపేటలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్

నాణ్యమైన విత్తనం...రైతన్నకు నేస్తం

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని రైతు వేదికలో శాస్త్రవేత్తలు రైతులకు దృశ్య శ్రవణం ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ జానకి మాట్లాడుతూ విత్తన సాంకేతికతను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా మూడేళ్లలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ కుమార్, ఏఓ శ్వేతా కుమారి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు వాడుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు నాణ్యమైన విత్తనాలను వాడుకోవాలని రాజేంద్రనగర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త చైతన్య, వ్యవసాయ అధికారి కృష్ణలు కోరారు. మంగళవారం ఆయా గ్రామాలలో ఎంపిక చేసిన రైతులకు పెసర, వరి (ఫౌండేషన్) విత్తనాలను రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు వినీత్, మమత, అఖిల్ తదితరులున్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చెవెళ్ల గ్రామంలో రైతులకు మంగళవారం పెసర, వరి విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ పద్మశ్రీ మాట్లాడుతూ రైతులు పండించి రైతులకు ఈ విత్తనాలు అందజేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏఓ రాజేశ్ , ఎఈఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

రేగోడ్(మెదక్): నాణ్యమైన విత్తనాలు వాడితే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త ప్రశాంత్ కుమార్ తెలిపారు. రేగోడ్‌లోని రైతువేదికలో ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు వాడకంపై పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ జావీద్, పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు రైతులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264